పోలే చంద్రశేఖర్ మరణం పట్ల సిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాలో దుండగుల కాల్పుల్లో హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ మరణించడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భౌతిక కాయాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

నిమ్స్‌కు రిటైర్డ్ ప్రొఫెసర్ వీల్ చైర్ల వితరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో పదవి విరమణ పొందిన ఫార్మకాలజీ విభాగాధిపతి పి.ఉషారాణి ఆ ఆస్పత్రికి ఐదు వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. శనివారం హైదరాబాద్ పంజగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆమె వీల్ చైర్లను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిమ్స్‌కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లు ఇవ్వడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వీల్ చైర్లను విరాళంగా అందించిన ఉషారాణికి డాక్టర్ బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్, అసిస్టెంట్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ చరణ్, ఆర్ఎంఓ సల్మాన్, డాక్టర్ పద్మజతో పాటు పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరం దాస్ శ్రీనివాసులు, ఫార్మకాలజీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవాలను ప్రోత్సహించేనా..?

- గత ఎన్నికల్లో రూ.10 లక్షల ప్రకటన
- నజరాన ప్రకటించి నిధులివ్వని బిఆర్ఎస్
- ఈసారి రైనా ప్రోత్సాహం కల్పించేనా..?
- స్థానిక సంస్థలకు ఇద్దరు పిల్లల నిబంధన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే ప్రభుత్వ పరంగా రూ.పది లక్షలు, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మొత్తంగా రూ.15 లక్షలు చెల్లిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. దాంతో ఆ నిధులతో గ్రామాభివృద్ధి చేపట్టొచ్చనే భావనతో పలు గ్రామాలు తమ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. కానీ ఊరించి ఊరించి ఉసురూమనిపించినట్టు పదవీకాలంలో ఒక్క పైసా చెల్లించలేదు. గత పంచాయతీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలోని 530 గ్రామాలకు 130 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,732 గ్రామాలకు గాను 2134 గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సగటు కంటే ఇక్కడే ఎక్కువ. అభ్యర్థులు సైతం ఏకగ్రీవం అయితే.. గ్రామాభివృద్ధికి, ప్రత్యేక నిర్మాణాలకు సొంత నిధులు వెచ్చిస్తామని హామీలు సైతం ఇచ్చారు. తీరా ఎన్నికలు పూర్తయిన తర్వాత నజరానా గురించి గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని నాటి సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. పదవీ కాలం పూర్తయ్యే నాటికి సైతం పైసా విదిల్చలే. దాంతో అప్పటి సర్పంచ్‌లకు గ్రామస్తుల నుంచి చివాట్లూ తప్పలేదు.

సర్పంచ్‌ల పదవీకాలం 2023 జనవరితో పూర్తయినా దాదాపు ఏడాదిన్నర వరకు ఎన్నికలు నిర్వహించలేదు. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాలకు నిధులు అందక పాలన ఆటకెక్కింది. రోజువారీ నిర్వహించే పనులు, మరమ్మతులకు సైతం నిధులు లేకపోవడంతో జిపి కార్యదర్శులే అప్పులు తీసుకొచ్చి పనులు చేపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి సందర్భంలో జిపిలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవం చేసే గ్రామాలకు నజరానా ప్రకటించాలని కోరుతున్నారు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవం చేసేందుకు ఏమైనా ప్రోత్సాహం కల్పిస్తుందా అని పల్లెవాసులు ఎదురుచూస్తున్నారు.

ఇద్దరు పిల్లల నిబంధన..

ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే పోటీకి అనర్హులనే నిబంధన ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్తించనున్నది. పాత నిబంధనలతోనే ఈసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులు సమాయత్త మయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ముగ్గురు లేదా అంత కంటే ఎక్కువ పిల్లలు ఉంటే వారు అనర్హులు. ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసే వారిలో కొందరికి ముగ్గురు పిల్లలు ఉండటంతో వారందరు ఈ అంశంపై ఆరా తీస్తున్నారు. గతంలో ఈ చట్టానికి సవరణ చేస్తారని ప్రచారం జరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. మొదట కాన్పులో ఒకరు పుట్టి రెండో కాన్పులో ఇద్దరు పుడితే పోటీకి అర్హులే. ఒక వ్యక్తి మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు ఉండి ఆమె చనిపోతే.. ఆయన రెండో పెండ్లి చేసుకుంటే ఆమెకు మరొక సంతానం కలిగితే భర్త ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడు అవుతాడు. కానీ ఆమెకు ఒకరే సంతానం ఉన్నారు కాబట్టి భార్య మాత్రం పోటీ చేయొచ్చు. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి ముగ్గురు పిల్లలుండి అందులో ఒకరు చనిపోతే ఆ వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడే. మహిళకు ఇద్దరు పిల్లలు ఉండి నామినేషన్ల పరిశీలన నాటికి ఆమె గర్భవతి అయి ఉంటే ఆమె ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హురాలేనని పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేస్తోంది. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి డబ్బులు రవాణా చేయకూడదనే నిబంధనలు పెట్టారు. దాంతో పండుగల పూట సామాన్యుల్లో భయాందోళన నెలకొంది.

ముగిసిన సుమిత్ర భాయ్ అంత్యక్రియలు

- మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్ర భాయ్ అంత్యక్రియలు శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో పూర్తయ్యాయి. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నల్లమోతు భాస్కరరావు, తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు చెరుపల్లి సీతారాములు, అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్ హాసం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, నాయకులు నూకల జగదీష్ చంద్ర, పారేపల్లి శేఖర్‌రావు, ఎండి సలీం, సత్తయ్య, రవి నాయక్, డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావండ్ల పాండు, వరలక్ష్మి, సీతారాములు, రెమిడాల పరుశు రాములు, వినోద్ నాయక్, శశిధర్ రెడ్డి, రొండి శ్రీనివాస్, అయూబ్, ఎంసిపిఐయు రాష్ట్ర నాయకులు వస్కుల మట్టయ్య, టిడిపి నాయకులు బంటు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌లో అసూస్ 7వ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఆసూస్ దేశవ్యాప్తంగా తమ రిటైల్ చెయిన్‌ను వేగంగా విస్తరిస్తోంది. న్యూమలక్‌పేట్‌లో కొత్త స్టోర్‌ను తెరిచినట్లు పేర్కొంది. దీంతో హైదరాబాద్‌లో తమకు ఇది 7వ స్టోర్ అని ఆ కంపెనీ ఇండియా హెడ్ జిగ్నేష్ భన్సర్ తెలిపారు. ఈ కొత్త స్టోర్‌ను 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ తమ ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ డెస్క్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, యాక్సెసరీలు సహా విస్తృత శ్రేణి ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ లభ్యం అవుతాయన్నారు.

స్టోర్‌ను ప్రారంభిస్తున్న జిగ్నేష్ భన్సర్

ఆర్‌టిసికి రూ.110 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టిజిఎస్‌ఆర్‌టిసికి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్టు యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్టు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గతేడాది ఇదే సీజన్‌లో 6,300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోల్చితే ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందనీ, కొందరు ప్రయివేటు వాహనాలనూ ఆశ్రయించినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టినట్టు తెలిపింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను టిజిఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో ద్వారా నిర్మించింది. రాబోయే 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా పది ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టిజిఎస్‌ఆర్‌టిసి అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతివ్వాలని రాష్ట్రప్రభుత్వానికి టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీలకు రూ.5, 4వ స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీని సంస్థ విధించనుంది. అలాగే మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.పది అదనపు ఛార్జీని వసూలు చేయనుంది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ అదనపు చార్జీ అమలు ఈ నెల 6 (సోమవారం) నుంచి అమల్లోకి వస్తుంది.

పిల్లల జాతర ప్రతిభా వికాసానికి వేదిక

- విశ్రాంత ఐఎఎస్ కెవి.రమణాచారి
- '5వ పిల్లల జాతర' రిసిప్షన్ కమిటీ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లల జాతర ఉత్సవాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడతాయని విశ్రాంత ఐఎఎస్ కెవి.రమణాచారి అన్నారు. హైదరాబాద్ మాసబ్ట్యాంక్ వద్ద గల రమణాచారి నివాసంలో శనివారం తెలంగాణ బాలోత్సవం '5వ పిల్లల జాతర' పోస్టర్ ఆవిష్కరించి రిసిప్షన్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బాలోత్సవం '5వ పిల్లల జాతర 2025' నవంబర్ 6, 7 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని సూచించారు. కమిటీ చైర్మెన్‌గా కెవి.రమణాచారి, చీఫ్ ప్యాట్రన్స్‌గా జస్టిస్ జి.రాధారాణి (రిటైర్డ్ జడ్జి- తెలంగాణ హైకోర్టు), అశోక్ తేజ (ఫేమస్ సినీ లిరిసిస్ట్), ఏనుగు నరసింహారెడ్డి (డైరెక్టర్ -భాష సాంస్కృతిక శాఖ), ఎం.డి.రియాజ్ (ఛైర్మెన్-గ్రంథాలయ శాఖ), ప్యాట్రన్స్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీస్‌గా మొత్తం 90మంది కమిటీలో ఉన్నారని తెలిపారు. ఈ పిల్లల జాతరలో 24 కార్యక్రమాలు 24 వేదికలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ కేటగిరీలుగా విభజించి వారి ఆసక్తికి తగిన అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ మహత్కార్యానికి విద్యాసంస్థల యాజమాన్యాలు, మేధావులు, తల్లిదండ్రులు సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, అధ్యక్షులు - భూపతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సుజావతి, మహేష్ దుర్గే, జె.వెంకన్న పాల్గొన్నారు.

ఓటు చోర్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టండి

- జూమ్ సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓటు చోర్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈనెల 15లోపు పూర్తి చేసి ఎఐసిసి కార్యాలయానికి పంపించాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన జూమ్ సమావేశంలో మాట్లాడారు. దేశంలో బిజెపి పెద్ద ఎత్తున ఓట్ చోర్ కార్యక్రమాన్ని నిర్వహించిందని చెప్పారు. దీంతోనే బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ బిజెపికి అనుబంధ సంఘంగా పని చేస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓట్‌చోరీ విషయంలో అన్ని రకాల ఆధారాలతో బిజెపి బండారాన్ని బయటపెట్టారని గుర్తు చేశారు. ఎంతో పకడ్బందీగా ఆధారాలు చూపించినప్పటికీ ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. రాష్ట్రంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి భారీ వర్షాలు కొంత అంతరాయం కలిగించాయని తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. గ్రామానికి కనీసం వంద మందితో సంతకాలు చేయించాలని కోరారు. ఓట్‌చోరీకి బిజెపి ఏ విధంగా పాల్పడిందో ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని కోరారు. డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఓటు చోరీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి కాంగ్రెస్ నాయకులు ఓటు హక్కు ఉన్న బూత్‌లో సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. జూమ్ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, ఆఫీసు బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, అనుబంధ సంఘాల చైర్మన్లు, అధికార ప్రతినిధులు, జిల్లా ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌కు 26 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో కూడా అంతే మొత్తంలో విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, పవర్ హౌస్‌కు 33,291 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. స్పిల్ వే ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుతం 587.30 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.68 టిఎంసిలుగా నమోదైంది.

మత్తు పదార్థాలతో అనర్థాలపై ప్రచారం చేయండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్తు పదార్థాలతో అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలో నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

వచ్చే వారంలో హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలు

- చింతల్‌లో బహిరంగ వేలం
- కెపిహెచ్‌బి, రావిర్యాలలోని భూములకు ఇ-వేలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 6న నుంచి జిహెచ్ఎంసి పరిధితోసహ పలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్ల విక్రయాలు జరగనున్నాయి. సోమవారం నగరంలోని చింతల్, నిజాంపేట బాచుపల్లి ప్రాంతంలో ఉన్న 22 రెసిడెన్షియల్ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న జారీ చేసింది. చింతల్ ప్రాంతంలో 18 ఎంఐజీ, హెచ్ఐజీ ప్లాట్లు, నిజాంపేట బాచుపల్లిలో నాలుగు ప్లాట్లను బహిరంగ వేలం వేయనున్నారు.ఇటీవల కెపిహెచ్‌బి కాలనీ ప్రాంతంలో హౌసింగ్ బోర్డు పలు దఫాలుగా నిర్వహించిన భూముల విక్రయాల్లో ఎకరా భూమి సుమారు రూ. 70 కోట్లకు ఇ-వేలం ద్వారా విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కెపిహెచ్‌బి కాలనీలో నాలుగు కమర్షియల్ ప్లాట్లను ఈనెల 7, 8 తేదీల్లో ఇ-వేలం ప్రక్రియ ద్వారా విక్రయించనున్నారు. ఫేజ్ 1, 2 పరిధిలో ఉన్న 6549 చదరపు గజాలతోపాటు, 2420 చ.గజాలు, 2397 చ.గజాలు, 726 చ.గజాల విస్తీర్ణంలోని ప్లాట్లను మంగళవారం ఇ-వేలం నిర్వహిస్తున్నది. నాంపల్లి ప్రాంతంలోని 1148 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్‌ను కూడా ఈనెల 8న ఇ-వేలం ద్వారానే విక్రయిస్తున్నట్టుగా హౌసింగ్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు ఈనెల 9,10 తేదీల్లో చింతల్‌లోని 10,890 చదరపు గజాల కమర్షియల్ భూమి, మహేశ్వరం మండలంలోని రావిర్యాల ప్రాంతంలోని 13,503చ.గ.లు, 5,953.20 చ.గ.లు,3,630 చ.గజాల విస్తీర్ణంలోని భూములను కూడా ఇ-వేలం ద్వారా విక్రయిస్తున్నది. ఇవే కాకుండా వచ్చే పది రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయానికి కూడా నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో సంగారెడ్డి, సదాశివపేటలోని ప్లాట్లు, జోగులాంబ గద్వాల, నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన భూములు ఉన్నాయి. ఇందుకు సంబంధించి కొద్దిరోజుల క్రితమే వివిధ రకాల నోటిఫికేషన్లను హౌసింగ్ బోర్డు విడుదల చేసింది.

ఎంబిబిఎస్, బిడిఎస్ మేనేజ్‌మెంట్ కోటా

సెకెండ్ ఫేజ్ కౌన్సిలింగ్‌కు నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్ యూహెచ్ఎస్) 2025-26 విద్యా సంవత్సరానికిగాను మేనేజ్‌మెంట్ కోటా (బి, సి కేటగిరీ) కింద ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్ వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 4న మధ్యాహ్నం 3 గంటల నుంచి అక్టోబర్ 6న మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెబ్ ఆప్షన్లనునమోదు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. కెఎన్ఆర్ యూహెచ్ఎస్ వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 22న విడుదల చేసిన ఫైనల్ మెరిట్ జాబితాలో పేరు ఉన్న అభ్యర్థులు మాత్రమే వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు అర్హులు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబిబిఎస్ సీటు పొంది, కళాశాలలో చేరి కొనసాగుతున్న అభ్యర్థులు కూడా ఈ దశలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి అర్హులు.

వైద్య అనుబంధ వృత్తి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య అనుబంధ వృత్తి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. శనివారం హైదరాబాద్ పంజగుట్టలోని నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నిమ్స్‌లో సీటు లభించడం అదృష్టంగా భావించాలని కోరారు. నిమ్స్ దేశంలోనే అత్యంత ఆధునిక రోగ నిర్ధారణ యంత్ర పరికరాలు, నిష్ణాతులైన సాంకేతిక సిబ్బంది, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది ఉన్న సంస్థ అని తెలిపారు. అలాంటి సంస్థలో శిక్షణ పొందడం ద్వారా విశాలమైన అవకాశాలు అంది పుచ్చుకోవచ్చని వివరించారు. మెడిసిన్‌లో సీటు రాలేదని బాధపడొద్దని సూచించారు. వచ్చిన అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ద్వారా సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో, పట్టుదలతో తాము ఎంచుకున్న కోర్సులో సుశిక్షితులు కావాలని ఆకాంక్షించారు. ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, కళాశాల ప్రిన్సిపల్ శిరందాస్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ దామోదర నాయుడు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

బ్రాంచ్ సందర్శించకుండానే పసిడి రుణం

- యాక్సిస్ బ్యాంక్, ఫ్రీచార్జ్ సరికొత్త సేవలు

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ తన డిజిటల్ సబ్సిడరీ ఫ్రీచార్జ్‌తో కలిసి దేశంలోనే తొలిసారిగా గోల్డ్ లోన్స్ ఆధారంగా క్రెడిట్ ఆన్ యుపిఐ సౌకర్యాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. దీంతో ఎంఎస్ఎంఇ, స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారులు, మర్చంట్లు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమ బంగారం ఆధారంగా తక్షణ రుణాన్ని పొందవచ్చని యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునీష్ శారదా తెలిపారు. ఇది పూర్తిగా డిజిటల్ మార్పు అని.. గోల్డ్ లోన్ ప్రాసెసింగ్ పూర్తయిన తర్వాత ఎలాంటి బ్రాంచ్ సందర్శన అవసరం లేకుండానే రుణం పొందవచ్చని, అదే విధంగా వినియోగించిన మొత్తంపైనే వడ్డీ విధించబడుతుందన్నారు. ఫ్రీచార్జ్ యాప్ లేదా ఏదైనా యుపిఐ యాప్ ద్వారా తక్షణ చెల్లింపులు, రీపేమెంట్స్ సులభంగా చేయవచ్చన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం పిల్లలను అనుమతించం

- తల్లిదండ్రులకు బిఎసి పాఠశాలల లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఎసి) ద్వారా పాఠశాలల్లో చేరిన ఎస్‌సి, ఎస్‌టి పిల్లల స్కాలర్‌షిప్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా చెల్లించని కారణంగా వారిని తరగతి గదుల్లోకి అనుమతించబోమని బిఎసి పాఠశాలల యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు శనివారం పిల్లల తల్లిదండ్రుల పేరిట బహిరంగ లేఖ విడుదల చేసింది. 'మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోయినప్పటికీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు, ఇతరుల నుంచి అప్పులు చేసి పాఠశాలలను నెట్టుకు రావడం జరుగుతోంది. ఈ విద్యా సంవత్సరం 2025-26 ప్రారంభంలోనే పిల్లలను పాఠశాలలో చేర్చుకోమని అధికారులు చెప్పారు. ఆ సమయంలో సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు నెల లోపు మీ స్కాలర్‌షిప్ డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వగా పిల్లలను పాఠశాలలో చేర్చుకున్నారు. ఎస్‌సి, ఎస్‌టి శాఖల సెక్రటరీలు, కమిషనర్లకు మా పరిస్థితులను వివరించాం. సెప్టెంబర్ 20వ తేదీ లోపు నిధులు విడుదల కాకుంటే దసరా సెలవుల తర్వాత పిల్లలను పాఠశాలలకు అనుమతించబోమని లేఖ ద్వారా తెలిపాం. కానీ ఇప్పటివరకు ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో పిల్లలను అనుమతించొద్దని నిర్ణయించాం. ఈ పరిస్థితును అర్థం చేసుకుని పిల్లల తల్లిదండ్రులు సహకరించాలి' అని వారు లేఖలో పేర్కొన్నారు.

రబీ పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు వర్తించవా?

- కేంద్రానికి తెలంగాణ రైతు సంఘం ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ సభ్యులంతా ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు వర్తించవా? కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించకుండా రైతులను వంచనకు గురి చేస్తారా? అంటూ తెలంగాణ రైతు సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. శనివారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రబీ పంటలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఎంఎస్‌పి ధరలు తీవ్ర నిరాశాజనకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో సి2 ప్లస్ 50 శాతం ఉండేలా ఎంఎస్‌పి ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఎ2 ఎఫ్ఎల్ ఫార్ములాతోనే ధరలను నిర్ణయించిందని విమర్శించారు. కుసుమలకు, కాయ ధాన్యాలకు అత్యధికంగా పెంచామంటూ కేంద్రప్రభుత్వం పదే పదే గొప్పలు చెప్పుకుందని తెలిపారు. కానీ పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ధరలను నిర్ణయించడం వల్ల రైతులకు ఉపయోగం లేదని స్పష్టం చేశారు. 11 ఏళ్లుగా ప్రధాని మోడీ పదే పదే రైతాంగాన్ని మోసం చేస్తూనే వస్తున్నారని విమర్శించారు. కచ్చితమైన సేకరణతో, చట్టబద్ధమైన ఎంఎస్‌పికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ బూటకపు వైఖరిని తేటతెల్లం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రచారాలు చేపట్టాలని, ప్రభుత్వం చేస్తున్న మోసానికి, ద్రోహానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాలని రైతాంగానికి వారు పిలుపునిచ్చారు.

ముగిసిన ఎమ్మెల్యేల విచారణ

- గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్
- స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో విచారణలు కొనసాగుతున్నాయి. ఈనెల ఒకటిన జగరగాల్సిన విచారణ వాయిదా పడటంతో ఇద్దరు ఎమ్మెల్యేలు శనివారం విచారణకు హాజరయ్యారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారిని విచారించారు. పిటిషనర్ల తరపున అడ్వకేట్లు.. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించారు. బిఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బిఆర్ఎస్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును బిఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ వివరణ ఇచ్చారు. పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని ఫిర్యాదుదారులు వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఎమ్మెల్యేల విచారణలు ముగిసిన అనంతరం స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

Before The VIII Addl. Motor Accidents Claims Tribunal : Nellore, A.P.

M.V.O.P.No. 637 / 2021

Thotapalli Teja Kumar Reddy - Claimant

Vs

1. Vallem Raja Reddy
and 2 others - Respondents

Notice

To,
R2. Medarametla Balaiah,
S/o **Nayudamma,**
resident of Turka Yanjal,
Sriram Nagar Colony, Hayath Nagar,
Rangareddy District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారములు కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే23-10-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.ఉమామహేశ్వర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

నవంబర్‌లో అఖిల భారత సంగీత నృత్య పోటీలు

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో "50వ అఖిల భారత సంగీత నృత్య పోటీలను నవంబర్ నెలలో వైభవంగా నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు వేమరాజు విజయ కుమార్, సమన్వయకర్తలు నిషాల సుధామాల, మధుమతి కులకర్ణిలు తెలిపారు. శనివారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర ఖజానా మరియు లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర, పోటీల నిర్వాహక సంఘం సభ్యులు రజిత్ ఆకుల, డాక్టర్ కామిశెట్టి గోదాలక్ష్మి, డాక్టర్ ఇందిరా హేమలతో కలిసి ఆవిష్కరించారు. వయస్సు ఆధారంగా యువకళాకారులను సీనియర్లు, జూనియర్లు, సబ్ జూనియర్లుగా విభజించి పోటీలను నిర్వహిస్తామని సుధామాల తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ నవ్యనాటక సమితి వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందవచ్చన్నారు.

ప్రశాంత్ కిషోర్ పొలిటికల్ బ్రోకర్

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రశాంత్ కిషోర్ (పికె) ఒక పొలిటికల్ బ్రోకర్ అని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. ఆయనకు రాజకీయ అనుభవం, అవగాహన లేదని చెప్పారు. ఆయన తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డిని ఓడిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, తిరుగుబాటుకు ప్రతీక అన్నారు. ఇక్కడి ప్రజలకు పొలిటికల్ బ్రోకర్ల అవసరం లేదని స్పష్టం చేశారు.

చట్టాలను తుంగలో తొక్కొద్దు

- రాజీనామాలు చేయండి
- బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమాభరత్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమాభరత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశమై క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా ఎదుర్కోవాలో వివరించారని ఆయన ఆరోపించారు. దానికి సంబంధించిన ఫుటేజీ కావాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశామని, ఆదివారం పిటిషన్ రూపంలో దాఖలు చేయనున్నట్టు తెలిపారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే ఇంకా బుకాయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపుదారులు సమాజానికి ఏం సందేశమిస్తారని ఆయన ఎద్దేవా చేశారు.

ముస్లిం మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

- మంత్రి అడ్లూరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రతి మహిళకు ఉపాధి - ప్రతి ఇంటికి ఆత్మవిశ్వాసం" అనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి యోజన కింద హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్టు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక శక్తివికాసం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికతో మహిళల సాధికారత, ఉపాధి అవకాశాల సృష్టి, నైపుణ్యాభివృద్ధి దిశగా పనిచేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2,500 మంది ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

మెడికల్ పిజి మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్ పీజీ-2025లో అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ నెల 4న సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ దరఖాస్తులకు గడువు విధించారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ చూసి తెలుసుకోవచ్చు.

11న పాలమూరు యూనివర్సిటీలో మెగా ప్లేస్‌మెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్టోబర్ 11న పాలమూరు యూనివర్సిటీలో మెగా ప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఒక ప్రకటనలో తెలిపింది. బల్క్ డ్రగ్ మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిడిఎంఎ) ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాకు 2021 నుంచి 2025 బ్యాచ్ వరకు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు క్యూసి, క్యూఎ, కెమిస్ట్, మెషిన్ ఆపరేటర్ తదితర సాంకేతిక హోదాల్లో ప్రముఖ ఫార్మా కంపెనీల్లో నియమితులు కావచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో హాజరు కావాలని కోరారు.

భూ సర్వే రోవర్లు వస్తున్నాయ్..!

- భూధార్ మ్యాప్‌ల తయారీలో ఇవే కీలకం
- ముందు ప్రభుత్వం.. తర్వాత ప్రయివేటు భూములకు జారీ
- ప్రభుత్వ భూములకు ప్రత్యేక సర్వే నంబర్లు
- ఇక మీదట బైనంబర్లకు గుడ్ బై..!


రోవర్ల పనితీరును అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సిఎం భటి విక్రమార్క (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంప్రదాయ భూసర్వే పద్ధతుల స్థానాల్లో అధునాతన సాంకేతికతతో కూడిన రోవర్లు, డ్రోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు దాదాపు 200 ఏండ్ల కిందటి గొలుసు కొలతలపై ఆధారపడి సర్వే చేస్తున్నారు. దీనివల్ల సర్వేయర్లకు అధిక శ్రమ ఉండేది. సంప్రదాయ విధానంలో సర్వే చేయడానికి 70 నిమిషాలు, మ్యాప్ తయారీకి మూడు గంటలు పట్టేది. కానీ రోవర్లతో ఈ ప్రక్రియంతా కేవలం పది నిమిషాల్లో పూర్తవుతుంది. భూమి పైనుంచి రోవర్ సహాయంతో.. ఆకాశం నుంచి డ్రోన్‌తో సర్వే చేస్తారు. ఈ సర్వే విధానం ద్వారా రెండేసి రిజిస్ట్రేషన్ల వివాదాలు, తక్కువ భూమి ఉండి ఎక్కువ విస్తీర్ణానికి రిజిస్ట్రేషన్, దస్త్రాల్లో భూమి ఉండి క్షేత్రస్థాయిలో లేకున్నా రిజిస్ట్రేషన్.. ఇలా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చిక్కులేవీ లేకుండా స్పష్టమైన హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా డ్రోన్‌లు, రోవర్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. వీటి ఆధారంగా భూముల సమగ్ర వివరాలను ఇట్టే తెలుసుకొని రాష్ట్రవ్యాప్తంగా భూధార్ కార్డుల జారీకి ప్రభుత్వం సమాయత్తం అవుతోంది.

బై నంబర్లకు బదులు ప్రత్యేక నంబర్లు

ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్, భూదాన్, మాన్యం, చెరువు శిఖాలు.. ఇలా రకరకాల భూములు కబ్జాకు గురవుతున్నాయి. నకిలీ పాస్‌పుస్తకాల ద్వారా వివాదాలు సృష్టిస్తున్నారు. ఆయా భూములతోపాటు రహదారులు, ఎస్సారెస్పీ కాల్వల కోసం సేకరించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు. బై సర్వే నంబర్ల బదులు ప్రత్యేక నంబర్లు కేటాయించి భూధార్ కార్డులు ఇవ్వనున్నారు. గొలుసులు, టేపుల కొలతలతో తప్పులకు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అత్యాధునిక పరికరాల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే చేయడానికి సమాయత్తం అవుతున్నారు. దీనిలో భాగంగా రోవర్లను ఉపయోగించనున్నారు. సర్వే కోసం ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు పది రోవర్లను కేటాయించింది. వీటికి తోడు మరికొన్ని రోవర్లు కావాలని జిల్లా అధికారులు భావించి ఐదు రోవర్లను కొనేందుకు టెండర్లు పిలిచారు.

ముందుగా ప్రభుత్వ భూముల సర్వే..

రోవర్ల ద్వారా ముందుగా ప్రభుత్వ భూములను సర్వే చేస్తారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 1.84 లక్షల ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. వీటిలో 47,442 ఎకరాల్లో అసైన్డ్ భూములు ఉన్నాయి. ఎర్రుపాలెం, వైరా, నేలకొండపల్లి, సింగరేణి, ముదిగొండ, ఖమ్మం అర్బన్, తిరుమలాయపాలెం, కల్లూరు, ఏన్కూరు మండలాల్లో 1,258 ఎకరాల్లో భూదాన్ భూములు ఉన్నాయని అంచనా. వీటిలో 101 ఎకరాలపై కోర్టు కేసులు ఉండగా 20 ఎకరాలపై నమోదైన ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారు. 726.27 ఎకరాలను ప్రజలకు అసైన్ చేశారు.

భూధార్ కార్డుల జారీకి తొలి అడుగు

భూధార్ కార్డుల జారీకి తొలి అడుగులో భాగంగా భూముల సమగ్ర వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఇందుకోసం ఐదు జిల్లాల్లో ఐదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. దీనిలో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు ఒకటి. ఈ ఏడాది మే నెలలో ఈ గ్రామంలో 103 సర్వే నంబర్లలోని 845.32 ఎకరాల భూములను అధికారులు డ్రోన్లతోపాటు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) ద్వారా సర్వే చేశారు. నక్షా రూపొందించి, అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మ్యాపులతో హద్దులు గుర్తించారు. ఇక్కడి అనుభవాలు, లోటుపాట్లపై అధ్యయనం చేస్తున్నారు. వివాదాలకు తావులేకుండా చేసి తొలుత ప్రభుత్వ, ఆ తర్వాత ప్రయివేటు భూములకు భూధార్ కార్డులు జారీ చేస్తారు. ఆధార్ కార్డు మాదిరిగా భూకమతానికి 14 అంకెలతో కూడిన యూనిక్ కోడ్‌ను కేటాయిస్తారు. ఈ యూనిక్ కోడ్ పొందేందుకు ఆధార్ కార్డుతోపాటు దానికి అనుసంధానించిన మొబైల్ నంబర్ తప్పనిసరి. వీటి ఆధారంగా వ్యవసాయ విస్తర్ణాధికారులు రైతులకు గుర్తింపు సంఖ్యలు కేటాయిస్తారు. యూనిక్ కోడ్ కేటాయింపుతో భూమికి గుర్తింపు వచ్చినట్టు అవుతుంది. ప్రతి రైతు భూముల వివరాల సమాచారం ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదవుతుంది. ఇది భూయజమాని, స్థానం, విస్తీర్ణం తదితర వివరాలను సులభంగా గుర్తించేందుకు దోహదపడుతుంది. భూమి ఉపయోగం నిర్ధారణ, ఆక్రమణలు, అక్రమ కట్టడాలనూ నియంత్రించొచ్చు. బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతోనూ భూముల అనుసంధానం ఎంతో సులభమని అధికారులు అంటున్నారు. ధరణి ద్వారా భూముల వివరాల్లో దొర్లిన అనేక తప్పిదాలను భూభారతి ద్వారా పరిష్కరిస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో కీలకమైన భూధార్ కార్డుల జారీలో సర్వే రోవర్ల పాత్ర ప్రధానమైనది.

రోవర్లు రాగానే మ్యాప్‌ల రూపకల్పన

ప్రభుత్వం పది రోవర్లు ఇస్తుంది. దీనికితోడు మరో ఐదు రోవర్లకు టెండర్లు పిలిచాం. ఇవి రాగానే భూసర్వే మొదలు పెట్టి భూధార్ కార్డుల జారీకి మ్యాప్‌లు రూపొందిస్తాం.

పినిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్

ఉమ్మడి మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్‌దే విజయం

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతున్నదని ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, పర్ణికారెడ్డి, రాజేశ్ రెడ్డి, గవినొళ్ల మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార శైలి, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలకు ఎప్పటికప్పుడు ధీటుగా బదులివ్వడం, సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాలను ఎదుర్కొని.. ప్రజలకు నిజాలు తెలియజేయడం వంటి పలు అంశాలు సమావేశంలో చర్చించారు. ఆయా అంశాలపై ఎమ్మెల్యేలు, నాయకులకు మంత్రి దామోదర రాజనర్సింహ పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, నాయకులకు టికెట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. టికెట్ల కేటాయింపు విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నాయకుల మధ్య సమన్వయ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరువ చేయాలని కోరారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను బలంగా తిప్పికొడుతూనే, ప్రజలకు వాస్తవాలు తెలిపేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని మంత్రి సూచించారు.

సహాయ సామగ్రిని అడ్డగించడం దుర్మార్గం

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇజ్రాయెల్ ప్రభుత్వం గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా తీసుకువెళ్తున్న సహాయ సామగ్రిని అడ్డగించడం దుర్మార్గమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్రకమిటీ కార్యదర్శి ప్రదీప్ సింఘా ఠాకూర్, సహాయ కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ సామాగ్రిని అడ్డగించడం, అపహరించడం అనాగరిక చర్య అని విమర్శించారు. ఈ ఘటనను సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ అధినేత క్రిమినల్ నెతన్యాహు ఫాసిస్టు ట్రంప్‌తో కలిసి, గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లాను అపహరించారని పేర్కొన్నారు. గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లాను, దానిలోని 500 మంది కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలకు పంపిణీ చేయడానికి రెడ్ క్రాస్‌కు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. మోడీ ప్రభుత్వం నెతన్యాహు ప్రభుత్వంతో అన్ని సంబంధాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

- అడ్డుకున్న స్థానికులు
- పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు
- 36 ఎకరాల ప్రభుత్వ భూములు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో హైడ్రా అధికారులు శనివారం ఉదయం పెద్దఎత్తున కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలను జెసిబిలతో తొలగించారు. స్థానికులు అడ్డుకోవడంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగించారు. సుమారు 36 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి హైడ్రా, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ విలేజ్ రెవెన్యూ సర్వే నెంబర్ 59లో 36 ఎకరాల భూమి 12 మంది రైతుల ఆధీనంలో ఉంది. అయితే, ఇది ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. దాంతో 12 మంది రైతులు ఆ భూమిని గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిందని రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ అధికారులు హైకోర్టులో కేసు వేశారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానికి చెందుతుందని ఇటీవల తీర్పు వెల్లడించింది. దాంతో శనివారం ఉదయం హైడ్రా, రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిసెలను కూల్చివేశారు. ఈ క్రమంలో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తమ గుడిసెలను కూల్చివేయొద్దంటూ స్థానికులు మొర పెట్టుకున్నారు. జెసిబిలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

60 ఏళ్లుగా ఈ భూమిలో ఉన్నామని ఆందోళన చేశారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు ఈ భూమిని తాము స్వాధీనం చేసుకుంటున్నామని హైడ్రా, రెవెన్యూ అధికారులు స్థానికులకు వివరించే ప్రయత్నం చేశారు. సుమారు 36ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3600 కోట్లు ఉంటుందని అధికారుల అంచనా. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యక్తులు భూమిని కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి రక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

నొప్పిని మరిపించే ఎక్స్‌ఆర్ టెక్నాలజీ!

ప్రజాశక్తి - హైదరాబాద్

చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు పలు సందర్భాల్లో నొప్పి తీవ్రంగా వేధిస్తుంది. అది మామూలు ఇంజెక్షన్ నొప్పి కావచ్చు, ఏదైనా శస్త్రచికిత్స చేయడం వల్ల కలిగే నొప్పి కావచ్చు, లేదా క్యాన్సర్ చికిత్సల్లో భాగంగా చేసే కీమోథెరపీ, కిడ్నీ సమస్యలకు చేసే డయాలసిస్.. ఇలా వేటి వల్ల అయినా విపరీతమైన నొప్పి వస్తుంటుంది. దానివల్ల అసలు చికిత్సలను చేయించుకోవడానికి కూడా కొంతమంది విముఖత చూపుతారు. ఇలాంటి అన్నిరకాల నొప్పులను మర్చిపోయేలా చేసేందుకు శనివారం గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన పెయిన్ స్కేప్ 2025 సదస్సు సందర్భంగా ఎక్స్‌ఆర్ అనే సరికొత్త టెక్నాలజీని కిమ్స్ ఆస్పత్రుల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ, "కొన్ని శస్త్రచికిత్సల వల్ల దీర్ఘకాలం పాటు నొప్పి ఉంటుంది. కొన్నిసార్లు కండరాల నొప్పి వస్తుంది. క్యాన్సర్ వల్ల, దాని చికిత్స వల్ల, నరాల్లోను, మెడ, తల నొప్పి లాంటివి చాలాసార్లు వేధిస్తుంటాయి. చివరకు గర్భిణీలు సాధారణ ప్రసవానికి వెళ్లినప్పుడు వారికి వచ్చే నొప్పులు భరించడం చాలా కష్టం. ఇలాంటి అన్నింటికీ అత్యంత సమర్థమైన పరిష్కారంగా ఈ ఎక్స్‌ఆర్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఇలాంటి అత్యాధునిక టెక్నాలజీలను అందిపుచ్చుకుని, రోగులకు తగిన సేవలు అందిస్తున్నందుకు మా వైద్యనిపుణులందరినీ అభినందిస్తున్నాను. ఆధునిక టెక్నాలజీని ఎప్పటికప్పుడు రోగులకు చేరువ చేయడంలో కిమ్స్ ఆస్పత్రి ఎప్పుడూ ముందే ఉంటుంది" అని చెప్పారు.

అక్టోబర్ ఏడు నుండి ఎఫ్ఐపి సిల్వర్ పాడెల్ టోర్నమెంట్

- టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న హైదరాబాద్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఇండియన్ పాడెల్ ఫెడరేషన్ మొట్టమొదటి ఎఫ్ఐపి సిల్వర్ హైదరాబాద్ టోర్నమెంట్‌ను నిర్వహించనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ అంతర్జాతీయ పాడెల్ ఫెడరేషన్ టూర్ ఈవెంట్‌లో రూ.15,00,000 రికార్డు స్థాయి ప్రైజ్ పూల్ ఉందని ఐపిఎఫ్ అధ్యక్షులు స్నేహ అబ్రహాం సెహగల్ పేర్కొన్నారు. ఇది భారతదేశంలో పాడెల్ క్రీడ చరిత్రలోనే అత్యధికం. ఈ టోర్నమెంట్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో ప్రపంచ స్థాయి అంతర్జాతీయ స్టార్లు, అలాగే ప్రతిభావంతులు పాల్గొంటారన్నారు. అక్టోబర్ 7నుండి12 వరకు జరుగుతుందన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆటగాళ్లు, దేశ చరిత్రలోనే అత్యధిక నగదుతో కూడిన బహుమతితో, ఈ టోర్నమెంట్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతోందన్నారు. మొట్టమొదటి ఎఫ్ఐపి సిల్వర్ టోర్నమెంట్‌కు రాధా టిఎంటి స్పాన్సర్ చేస్తుందని రాధా టిఎంటిబార్ ఛైర్మన్ సునీల్ సరాఫ్ తెలిపారు.

పోరాటాలకు సన్నద్ధం కావాలి

- పాలడుగు భాస్కర్
- మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 4వ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 4వ మహాసభ అక్టోబర్ 26, 27 తేదీల్లో రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలో జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో మొదటి రోజు జరిగే బహిరంగ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ మాట్లాడుతూ... మహాసభకు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. గడిచిన మూడేండ్లలో చేసిన పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన కోసం చర్చించనున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ పాల్గొన్నారు.

వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ

- ఉస్మాన్‌సాగర్ 4 గేట్లు, హిమాయత్‌సాగర్ ఒక గేటు ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాతావరణం శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో హైదరాబాద్ జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. గతవారపు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా.. జంట జలాశయాలకు పైనుంచి వస్తున్న వరద నీటిని బయటకు వదులుతున్నారు. శనివారం జలమండలి ఎమ్‌డి అశోక్‌రెడ్డి జంట జలాశయాలను సందర్శించారు. రెవెన్యూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతుండటంతో 4 గేట్లను 2 అడుగుల మేర ఎత్తిన అధికారులు 920 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ఉస్మాన్‌సాగర్‌కు 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హిమాయత్‌సాగర్ జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. ఇప్పటికే రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరువలో నీరు ఉండటంతో ఒక గేటును మూడు అడుగుల మేర ఎత్తి 1017 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం హిమాయత్‌సాగర్‌కు 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆరెంజ్ అలర్ట్, వాతావరణ సూచనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి దశలవారీగా 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని, ఉస్మాన్ సాగర్ నుంచి 3వేల క్యూసెక్కుల విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం

- ఆరు దుకాణాలు దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధి లోతుకుంట వద్ద ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. లోతుకుంట ప్రధాన రహదారి పక్కనే ఉన్న సైకిల్ దుకాణంలో చెలరేగిన మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించడంతో అగ్నిప్రమాద తీవ్రత పెరిగింది. ఈ అగ్ని ప్రమాద ఘటనలో ఆరు దుకాణాలు దగ్ధం కాగా ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో ఘటన స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దుకాణాలలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

పత్తిని ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవద్దు

- రైతులకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విజ్ఞప్తి
- ఈ నెల 21 నుంచి సిసిఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 21 నుంచి సిసిఐ అధికారికంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభించనుందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. అప్పటివరకు తొందరపడి పత్తి ప్రయివేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంతకు ముందు ఆయన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడినట్టు తెలిపారు. రైతులు పత్తి పంట అమ్మకాల సమయంలో దళారుల చేతుల్లో మోసపోతున్నారని సిసిఐకి వివరించినట్టు పేర్కొన్నారు. సిసిఐ కొనుగోలు చేసే క్రమంలో కొంతమంది దళారుల జోక్యం ఉంటుందని సిసిఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. గతేడాది సకాలంలో సిసిఐ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తిలో తేమ 12 శాతం ఉన్న కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. పత్తి పంట పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు సంచుల్లో కాకుండా ఓపెన్‌గానే తీసుకరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 6న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, సిసిఐ ఉన్నతాధికారులతో సమావేశం జరగనుందని ఆయన తెలిపారు.

కెసిఆర్ పై కక్షతో ఆస్పత్రులపై నిర్లక్ష్యం

- బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిన కాంగ్రెస్
- వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల పనులను పూర్తి చేయాలి
- కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి సందర్శనలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ మీద కక్షను ఆస్పత్రులపై చూపించడం దారుణమని, తమ ప్రభుత్వంలో తలపెట్టిన నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల(టిమ్స్) నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఎల్బీనగర్‌లో కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేష్, వివేకానంద్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ వందేళ్ల ముందుచూపుతో హైదరాబాద్ నలు దిక్కులా నాలుగు టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ హెల్త్ సిటీ, నిమ్స్ విస్తరణ వంటి ప్రాజెక్టులు ప్రారంభించారని తెలిపారు. కానీ చేతగాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాటిని రెండేళ్లుగా అర్ధాంతరంగా వదిలేసిందన్నారు. కెసిఆర్‌కు మంచి పేరు రాకూడదన్న ఉద్దేశంతోనే ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేయకుండా అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. తాము భూసేకరణ, టెండర్లు, డిజైన్‌లు, నిధులు అన్నీ పూర్తిచేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఐదు అంతస్తుల స్లాబులు మాత్రమే వేసిందని అన్నారు. ఇదే ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనాతీరుకు నిదర్శనమన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ స్థాపనకు రూ.176 కోట్లు మంజూరు చేసి జీవో కూడా విడుదల చేసినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టును రద్దు చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఇంతకుముందు 72 శాతం ప్రసవాలు జరిగితే, ప్రస్తుతం అవి 50 శాతానికి తగ్గిపోయాయని అన్నారు. బస్తీ దవాఖానల డాక్టర్లు, సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని, పేదలకు ఆరోగ్యసేవలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1400 కోట్లకు చేరాయన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల పనులను యుద్ధ ప్రాతిపదికన ఆరు నెలల్లో పూర్తి చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.